క్లుప్తంగా

పాఠశాలల తనిఖీ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు, సీఆర్పీ కంటి నర్సయ్య ఎంపీయూపీఎస్ లోకారి, పిప్పల్‌ధరి, అంకోలి ప్రాథమిక పాఠశాలలను బుధవారం సందర్శించారు. ఉపాధ్యాయుల టీచింగ్ డైరీ, విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు, యూడైస్ ఉన్న విద్యార్థుల సంఖ్యపై ఆరా తీశారు. ఆయన వెంట ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

తలమడుగు: శీతకాలం పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గొంటిముక్కల ప్రేమేందర్ అన్నారు. బుధవారం మండలంలోని ఖోడథ్ గ్రామంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎస్సీ వర్గీకరణ బిల్లు చేస్తామని, మాదిగ జాతికి అండగా నిలుస్తామని హామీ ఇవ్వడం జరిగిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో సుద్దాల శివ కుమార్, మంత్రి స్వామి, అశోక్, కడదరపు ప్రవీణ్, సుంకే రమేశ్, గొంటిముక్కల గోపి, గంగన్న, బాపన్న, గంగాధర్ పాల్గొన్నారు.

'మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వొద్దు'

సిరికొండ: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాన్ని జనవాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలని ప్రజలు తహసీల్దార్ విజయ్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. గ్రామ మొదటి వార్డు సమీపంలో ఏర్పాటు చేస్తున్నారని, ఇక్కడ ఏర్పాటు చేస్తే మహిళలు, విద్యార్థులు ఇబ్బంది పడుతారని తెలిపారు. మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వొద్దని కోరారు.

ట్రాక్టర్ పరికరాలు చోరీ

ఇంద్రవెల్లి: మండలంలోని ఏమాయికుంట గ్రామ పంచాయతీ ట్రాక్టర్ సెల్ఫ్ మోటర్, బ్యాటరీని గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించినట్లు పంచాయతీ కార్యదర్శి సత్యానారాయణ బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట పార్కింగ్ చేసి ఉంచిన ట్రాక్టర్ పరికరాలను దొంగిలించినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలతో సమావేశం

కాసిపేట: పోలింగ్ స్టేషన్లలో కనీస సౌకర్యాలు కల్పించేల చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎంఏ అలీం, తహసీల్దార్ భోజన్న తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలతో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఓటరు స్లిప్‌లు అందించడంలో జాప్యం చేయకుండా, అప్రమత్తంగా ఉంటూ సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీర్సా ముండా ఆశయసాధనకు కృషిచేయాలి

కాసిపేట: ఆదివాసీల ఆరాధ్య దైవం బీర్సా ముండా ఆశయసాధనకు ఆదివాసీలు పూర్తిస్థాయిలో కృషి చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. మండలంలోని కొండాపూర్‌లో ఆదివాసీ సేన ఆధ్వర్యంలో బుధవారం 148వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మడావి వెంకటేష్, మడావి గంగారాం, పెందూర్ శంకర్, సిడాం గణపతి, పెందూర్ ప్రభాకర్, ఆత్రం సంజీవ్, రాము తదితరులున్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలని వినతి

చెన్నూర్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఎదుట అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను వెంటనే తొలగించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ గంగాధర్‌కు వినతిపత్రాన్ని అందజేసినట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మామిడి అక్షిత తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, ఏబీవీపీ సభ్యులు దివ్య, దీప్తి, వినయ్, వసుధ పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ చేయొద్దు'

ఖానాపూర్: కలిసిమెలిసి ఉంటున్న దళితుల మధ్య కేంద్రప్రభుత్వం చిచ్చుపెట్టి ఎస్సీ వర్గీకరణ చేయొద్దని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి రాజన్న, జిల్లా కన్వీనర్ నత్యేం శ్యామ్ అన్నారు. బుధవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్గీకరణ చేస్తే కర్ణాటకలో బీజేపీకి పట్టిన గతే తెలంగాణలోనూ పడుతుందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపే రాజకీయ పార్టీలకు మాలలంతా కలిసి గుణపాఠం చెబుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బేర తిరుమలేశ్, లక్ష్మినర్సయ్య తదితరులున్నారు.

శివాలయంలో కార్తీకమాసం సందడి


శివాలయంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక శివాలయంలో కార్తీక మాసం సందర్భంగా శత సహస్త్ర ప్రదక్షిణ మహా యజ్ఞం ప్రారంభమైంది. దీంతో ప్రతిరోజు వందల సంఖ్యలో భక్తులు నిత్యం ప్రదక్షిణలు చేస్తున్నారు. భక్తులు తెల్లవారు జామున చల్లటి నీళ్లతో స్నానాలు ఆచరించి ఆలయానికి చేరుకొని ప్రదక్షిణల్లో పాల్గొంటున్నారు. శివాలయంలో కార్తీక మాసం సందర్భంగా నెలరోజుల పాటు పంచ హారతి, నక్షత్ర హారతి ఇస్తున్నారు. ఉదయం 5.30 గంటలకు ప్రారంభమైన ఈ హారతీ 6గంటల లోపు ముగుస్తుంది. కాగా గత ఆరేళ్లగా స్థానిక శివాలయంలో శత సహస్త్ర ప్రదక్షిణ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు వేదపండితుడు పరమేశ్వర్ పేర్కొంటున్నారు.

ఇంటింటా బీజేపీ ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

దహెగాం: ఎన్నికల సమయం దగ్గర పడుతున్న వేళ ప్రచారాలు ముమ్మరం చేశారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబుకు మద్దతుగా బీజేపీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్ ఆధ్వర్యంలో మార్కెట్ ఏరియాలో దుకాణాల వద్ద, ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వుకు ఓటు వేసి బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందని వివరించారు. పేద ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. హరీశ్‌బాబుకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పడాల సురేశ్, సంజీవ్, దెబ్బటి సత్యనారాయణ, ప్రదీప్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

వరి కోతలు ప్రారంభం

- పెరిగిన హార్వెస్టర్ల వినియోగం
- అధిక ధరలతో రైతులపై అదనపు భారం
- గుబులు పుట్టిస్తున్న వాతావరణ మార్పులు


రెబ్బెన శివారులో వరి కోస్తున్న హార్వెస్టర్

రెబ్బెన: వర్షాకాలంలో సాగు చేసిన వరి పంట కోతకు సిద్ధమైంది. బోరు బావుల కింద ముందస్తుగా సాగు చేసిన పంటల కోతలు ఇప్పటికే ప్రారంభం కాగా కుంటలు, చెరువులు, వట్టివాగు ప్రాజెక్టు కెనాల్ కింద సాగు చేస్తున్న పంటలు మరో 15 రోజుల్లో కోతలకు వచ్చే అవకాశం ఉంది. కాగా గత కొన్ని రోజులుగా వాతావరణ మార్పులు రైతుల్లో గుబులు పుట్టిస్తున్నాయి. కోతలు పూర్తి చేసి ధాన్యం ఆరబెడుతున్న రైతులు ఆకాశంలో ఏర్పడుతున్న మబ్బులను చూసి ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన ఖర్చులు..

వ్యవసాయంలో రోజురోజుకూ యంత్రాల వినియోగం పెరుగుతోంది. గతంలో కూలీలతోనే వరికోత పనులు చేపట్టగా ప్రస్తుతం హార్వెస్టర్‌లపై ఆధారపడి వరికోతలు చేపడుతున్నారు. కూలీలతో పోల్చితే యంత్రాల వినియోగంతో రైతులకు సమయంతో పాటు డబ్బులు కూడా ఆదా అవుతున్నాయి. అయితే ఈసారి పెరిగిన హార్వెస్టర్‌ల కిరాయిలు రైతులపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. గత ఏడాది టూవీలర్ హార్వెస్టర్‌కు గంటకు రూ.1800 వరకు తీసుకోగా ఈసారి గంటకు రూ.2200 వరకు వసూలు చేస్తున్నారు. ఇక ఫోర్ వీలర్ హార్వెస్టర్ యంత్రానికి గంటకు గత ఏడాది రూ. 2600 వరకు ఉండగా ఈసారి ఏకంగా రూ. 3000 వరకు తీసుకుంటున్నారు. బురద పొలాల్లో వినియోగించే చైన్ హార్వెస్టర్‌కు గత సంవత్సరం గంటకు రూ.3000 వరకు ఉండగా ఈసారి రూ. 3500 ఉంది. దీనికి తోడు హార్వెస్టర్ల కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. రైతులు అనుకున్న సమయంలో వరికోత పనులు పూర్తి కావడం లేదు.

గుబులు పుట్టిస్తున్న మబ్బులు..

వాతావరణంలో ఏర్పడుతున్న మార్పులు రైతుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. వరి పొలాల్లో కోత పనులు సులువుగా సాగేందుకు వీలుగా తడిని ఆరబెడుతున్నారు. 15 రోజుల క్రితమే నీటి మళ్లింపు పూర్తిగా నిలిపివేసిన రైతులు పొలాలను ఆరబెడుతున్నారు. అయితే గత మూడు రోజులుగా వాతావరణంలో ఒక్కసారిగా ఏర్పడిన మార్పులు రైతులను కలవరపెడుతున్నాయి. ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో అకాల వర్షాలు పడుతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సమయం ఆదా



వానాకాలం సాగు చేసిన వరి పంట మరో 15 రోజుల్లో కోతకు వచ్చేలా ఉంది. ప్రస్తుతం పొలానికి నీళ్లు ఆపి నేలను ఆరబెడుతున్నాం. తడి ఆరిపోగానే హార్వెస్టర్‌తో పంట కోతలు ప్రారంభిస్తాం. హార్వెస్టర్‌తో వరికోత ఎంతో సమయాన్ని ఆదా చేస్తుంది.

\- గోపాల్, నంబాల

పెరిగిన రేట్లతో అదనపు భారం



ఈసారి హార్వెస్టర్ల కిరాయి బాగా పెంచారు. గత సంవత్సరంతో పోల్చితే ఈసారి గంటకు రూ. 200 నుంచి రూ. 500 వరకు పెంచారు. తడి అధికంగా ఉన్న పొలాల్లో అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. పెరిగిన రేటుతో అదనపు భారం పడుతోంది.

\- ఇంగు మొండయ్య, నంబాల

మబ్బులతో ఆందోళన



నేను సాగు చేసుకున్న వరిపంట కోత దశకు చేరుకుంది. ఆకాశంలో ఏర్పడుతున్న మబ్బులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎప్పుడు వర్షాలు పడి కోత పనులు సాగవోనని భయంగా ఉంది. వర్షం పడితే పంటలు కూడా దెబ్బతినే అవకాశం లేకపోలేదు.

\- పెసరి వెంకటమ్మ, రెబ్బెన

ట్రాక్టర్ బోల్తా.. తప్పిన ప్రమాదం


బోల్తాపడిన ట్రాక్టర్

తిర్యాణి: బ్రేకులు ఫెయిల్ కావడంతో ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కాగజ్‌నగర్ పట్టణం నుంచి మండలంలోని నాయకపుగూడ గ్రామానికి ఇంటి నిర్మాణానికి అవసరమైన ఐరన్ లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ మండలంలోని భీమన్న గుట్ట సమీపంలో బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. డ్రైవర్ చేతికి స్వల్ప గాయాలయ్యాయి.

కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలి


మాట్లాడుతున్న ఉపేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రభుత్వాలకు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. రెబ్బెన మండలం గోలేటి ఎక్స్‌రోడ్ వద్ద బుధవారం సింగరేణి కాలరీస్ కోల్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ అనేక పోరాటాలు చేస్తోందన్నారు. రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి, ప్రమాద బీమా రూ.10లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కోల్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లు, వర్కర్లకు కనీస వేతనాలు అందించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు, సింగరేణి లాభాల్లో వాటా, కార్పొరేట్ వైద్య సదుపాయం, ప్రతినెలా 7న వేతనాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచి అధ్యక్షుడు అరికిళ్ల స్వామి, ప్రధాన కార్యదర్శి గౌస్, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, ఉపాధ్యక్షుడు లచ్చన్న, రవిప్రసాద్‌గౌడ్, సంయుక్త కార్యదర్శి గోపాల్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న కోఆర్డినేటర్ ఆనంద్‌రావు

కెరమెరి: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు, రైతులు అవగాహన కలిగి ఉండాలని కిసాన్ మిత్ర హెల్ప్‌లైన్ సొసైటీ, ఆసిఫాబాద్ కోఆర్డినేటర్ కనక ఆనంద్‌రావు అన్నారు. బుధవారం కొఠారి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. పోడు భూములు, సాగు భూములు, రెవెన్యూ, మార్కెట్ వ్యవస్థ, పంట రుణాలు, రైతుల ఆత్మహత్యలు, రైతుబీమా, ఉపాధిహామీ పథకం, వివిధ రకాల పింఛన్లు, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అందించే సహాయం తదితర అంశాలపై పూర్తిగా వివరించారు. కార్యక్రమంలో రైతుమిత్ర మండల కో ఆర్డినేటర్ కుమురం బండేరావు తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

కాగజ్‌నగర్‌రూరల్: ఓటుహక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమిడే భీమేశ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమాజ మార్పు, అభివృద్ధి కోసం 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీరు, బిర్యానికి అమ్ముడు పోకుండా నిజాయితీగా ఓటు వేసి పేద బడుగు బలహీన వర్గాల కోసం పనిచేసే నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. ఓటింగ్ శాతాన్ని పెంచే విధంగా యువత ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వసాకె సాయికుమార్, కాగజ్‌నగర్ మండల నాయకులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న సాకడలో 'కొలబోడి'


ఇప్పచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

కెరమెరి: గడిచిన పది రోజులుగా కొనసాగిన దండారీ ఉత్సవాలు బుధవారం చిన్న సాకడ గ్రామంలో ముగిశాయి. కొలబోడి పేరిటా నిర్వహించిన ఈ ఉత్సవాన్ని ఆదివాసీలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామస్తులు, గుస్సాడీలు, దండారీ, పోరీలు డప్పులు, తుడుం వాయిస్తూ ఇప్పచెట్టు వద్దకు చేరుకొని నెమలీకల టోపీలతో పాటు వివిధ రకాల ఆభరణాలు ఇప్ప చెట్టువద్ద భద్రపర్చారు. అనంతరం గోదావరి నదిలో స్నానమాచరించి ఏత్మాసూర్ పేన్, చెంచిభీమల్ దేవతకు పూజలు చేశారు. కార్యక్రమంలో పటేల్ దంబీరావు, కెర్పంట ఇస్రు, పెందోర్ ఆనంద్ రావు, శ్రీనివాస్, తుకారాం, సోము, సాగర్, భీము, అర్జున్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

వరిలో పంటకోత ప్రయోగం

నెన్నెల: మండలంలోని కోనంపేటలో వరి పంట పొలాల్లో బుధవారం వ్యవసాయాధికారులు, రైతులతో కలిసి పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ ప్రేమ్‌కుమార్, ఏఈఓ రాంచందర్ మాట్లాడుతూ.. పంట కోసే ముందు ఐదు మీటర్ల పొడవు, 5మీటర్ల వెడల్పు తీసుకున్నామన్నారు. అందులో వచ్చిన ధాన్యం దిగుబడిని లెక్కకట్టామని చెప్పారు. తద్వారా వచ్చిన దిగుబడి ఆధారంగా పంట మొత్తం దిగుబడి ఎన్ని బస్తాలు వస్తున్నాయో తెలుసుకోవచ్చన్నారు. పంటకోత ప్రయోగం ఎలా చేయాలో వారు వివరించారు. వరి సరాసరి దిగుబడి నిర్ధారణకు ప్రభుత్వం ఏటా ఈ ప్రయోగాలు చేస్తుందన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి


బోధిస్తున్న ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డి అన్నారు. తిర్యాణి ఎంఈవో వెంకటస్వామితో కలిసి బుధవారం కెరమెరి మండలంలోని మోడి కేజీబీవీని సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠ్యాంశాలు చదివించి, బోర్డుపై లెక్కలు చేయించారు. ఉన్నతి కార్యక్రమం అమలు తీరుపై ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులు, అధ్యాపకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌వో మీనాకుమారి తదితరులు ఉన్నారు.

కేజీబీవీలో ఉపన్యాస పోటీలు

తానూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బుధవారం సోషల్ ఫోరం ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని బి.సంధ్యారాణి ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నరేందర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అలేఖ్య, ఉపాధ్యాయులు భూమన్నయాదవ్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


శిథిలావస్థకు చేరిన జంబుగ ప్రభుత్వ పాఠశాల భవనం


శిథిలావస్థకు చేరుకున్న గచ్చు


పెచ్చులూడిన పాఠశాల పైకప్పు

- శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు
- పట్టించుకోని అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించి మెరుగైన విద్య అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. మండలంలోని జంబుగ పాఠశాల విద్యార్థులు శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనంలో విద్యనభ్యసిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎప్పుడో ఏ ప్రమాదం జరుగుతుందోనని తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఈ పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 41 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా వీరందరికి కేవలం రెండు గదులు మాత్రమే ఉన్నాయి. ఇద్దరు ఉపాధ్యాయులు ఈ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. కాగజ్‌నగర్ మండలం జంబుగ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి పగుళ్లు తేలాయి. స్లాబ్ నుంచి పెచ్చులు రాలిపడుతున్నాయి. మరోవైపు గచ్చు కూడా లేచిపోవడంతో నేలపై కూర్చోవడానికి ఇబ్బందిగా మారింది. దీంతో విద్యార్థులు పలు రకాల అవస్థలకు గురవుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటికి ఇబ్బందే..

పాఠశాలలో ఉన్న బోర్‌వెల్ నుంచి వచ్చే నీరు దుర్వాసన వస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. కొంత మంది విద్యార్థులు ఇంటి నుంచే నీటిని తెచ్చుకుంటున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పలుసార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. మన ఊరు మన బడి కింద పాఠశాలను ఎంపిక చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భయపెట్టిస్తున్న గ్రామసింహాలు


కౌటాల - విజయనగరం రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలు


కౌటాల -బెజ్జూర్ ప్రధాన రహదారిపై తిరుగుతున్న శునకాలు

కౌటాల: గ్రామాల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కలతో పిల్లలు, పెద్దలు నానా అవస్థలు పడుతున్నారు. శునకాలు గుంపులుగుంపులుగా తిరుగుతూ ప్రజలు, మేకలు, గొర్రెల మందలపై దాడి చేస్తున్నాయి. బుధవారం మండల కేంద్రంలో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ స్థానికులను భయందోళనకు గురిచేశాయి. జిల్లాలోని గ్రామాల్లో కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వీటి బారి నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. పగలు, రాత్రివేళ అనే తేడా లేకుండా రోడ్డెక్కితే కుక్కలు భయపెడుతున్నాయి. అధికారులు, పాలకవర్గాలు వీటి నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడంతో వీటి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వీధి కుక్కల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.